**ఏ వ్యాధికి ఆ చికిత్స. తేనె ఉపయోగించినా, విషం ఉపయోగించినా, చికిత్స విచికిత్స అంతా రోగిని బాగుచెయ్యాలనే.**

**నేను జబ్బు పడ్డానని, మా శ్రీమతి చికిత్సవల్లనే నేను తేరుకొన్నానని నాకు తెలిసేసరికి చాలా కాలం పట్టింది. అలా అని మా ఆవిడ పేరుమోసిన డాక్టరూ కాదు, నర్సూ కాదు. కేవలం ఒక మామూలు గృహిణి మాత్రమే.**

ఆవిడ. వానా కాలపు చదువంటే నాకు నిజంగా చిన్న చూపే. ఒక గ్రాడ్యుయేట్‌కు గృహిణి అయినందుకు గర్వపడకపోగా పైగా చదువుకొన్న వాళ్ళపై ఆవిడకు సదభిప్రాయం లేనందుకు నాకు నిజంగా చాలాఆశ్చర్యం. బాధ ఒక్కొక్కసారి కోపంకూడా కల్గేది.

ఆ రోజు మా ఆవిడ చాలా సర్దాగా. హుషారుగా నా కంటికి అందంగా కన్పించింది. ఆవిడ చెల్లెలిగారి పెండ్లి అనుకోకుండా, హఠాత్తుగా ఖాయమైందని. అందరినీ వెంటనే బయలుదేరి రమ్మని టెలిగ్రామ్ వచ్చినట్లు దరిమిలా విచారణమీద తెలిసింది. నాకూ వెళ్ళాలనే వుంది. అయినా వాళ్ళందరికీ దూరంగా ఈ మారుమూల ప్రాంతంలో నిలబడిపోయి మనసు మొద్దుబారిపోయింది. ఒకసారి బంధు సమూహాన్ని పరికించే సదవకాశం లభించినందుకు ఎంతో ఆనందించాను.


పెండ్లి పందిరి కిటకిటలాడుతూ భారంగా, నింగాడు. ఇప్పుడో, ఇంకాసేపటికో ప్రసవించబోయే పూర్ణ గర్భిణిలా వుంది. కానుపు చేయడానికి వచ్చిన డాక్టరమ్మలా మా ఆవిడ కావల్సిన యేర్పాట్లు చేయిస్తూ కల్యాణ ఘడియ కొరకు కని పెట్టుకొని వుంది.

నేను పందిరిలో ఒక ప్రక్క బంధు మిత్ర పరివేష్టితుడనై ఏదో పిచ్చాపాటి మాట్లాడుతున్నాను. ఇంతలో తలంబ్రాలు అంటూ పురోహితుడు ప్రకటించగానే ముచ్చట్లు ఆపి అందరమూ కల్యాణ మండపము చుట్టూ చేరాం. తన స్వహస్తంమీద పెండ్లి జరిపిస్తున్న మా ఆవిడ నా వైపు చూడడానికి కూడా తీరిక లేకుండా పెండ్లి సంబారాలు అందియ్యడంలో మునిగిపోయి వుంది.

నేను తీరిగ్గా పెండ్లి పందిరి వెలుగులో అంగరినొకసారి అనాలోచితంగా కలయ చూడడంలో నా దృష్టి నాకు కొద్దిగా ముందు వరుసలో లైటు క్రింద నిలబడ్డ రెండు జడల ఎర్ర అమ్మాయి మీద పడింది. ఫారెన్ నైలెక్స్‌లో పొట్లము కట్టబడ్డ అందమైన నవయవ్వనాన్ని చూసేసరికి నా నరాలు జివ్వుమన్నాయి.

నేనేమీ నూనూగు మీసాల నవ యువకుణ్ణి కాదు. అందమైన ఆడపిల్లల వెంట అల్లరిగా తిరిగే జులాయి వ్యక్తిని కాదు. పైగా మా ఊరిలో నాకు పెద్ద మనిషి అనే పేరు కూడా వుంది. అన్నిటికంటే నాచుట్టు నాచదువుసంస్కారమువల్ల మా ఆవిడకుగల వల్ల మాలిన గౌరవము తాలూకు పిట్టగోడవుంది. అయినా నామనసు అనే మధుపం వీటినన్నిటిని అనాయాసంగా దాటి ఆ అమ్మాయి సుందర వదనార విందంపై మెల్లగా వాలి మకరందము కోసం మారాంచేయసాగింది. నేను తలంబ్రాలు తీప్పేసరికి మంగళసూత్రధారణజరిగి అందరూ అక్షింతలు వేస్తున్నారు. వెంటనే నా చేతిలో వున్న అక్షింతలు అనుకోకుండా ఆ అమ్మాయిపై పడ్డాయి. ఆ అమ్మాయి ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూసింది. కంటి కొనలలో ఎర్ర జీర తాలూకు అరుణిమ చూసి అదిరిపడుతున్న నా గుండెను పెదాల చివర్న మొలకెత్తి మాయమైన సన్నని చిరునవ్వు సేద తీర్చింది. కొండంత ధైర్యము కలిగింది. ఆ ఉషారులో ఏదో తియ్యనిపాట ట్యూన్ చేయబోయి మెళుకువవచ్చి ఆగిపోయాను. ఒక్కసారిగా గుర్తుకు వచ్చినట్లు మా ఆవిడ వైపు చూశాను. ఆమె పెండ్లి కూతురి శిరోజాలలో చిక్కుకొన్న బియ్యపు గింజలను దులుపుతూవుంది. నా స్మగిలింగ్ మా ఆవిడ సర్చిలైట్లకు అందలేదులెమ్మని తృప్తిగా నిట్టూర్చాను.

చదివింపుల కార్యక్రమము కాగానే బట్టలు మార్చుకొనే గదిలో దూరాను. అక్కడే ఏదో పనిమీద వున్న ఆ అమ్మాయిని చూసి అట్టే రెప్పకొట్టను మరచిపోయాను. ఆ అమ్మాయి చిరునవ్వుతో "ఏం బావా! బాగున్నావా?" అంది. ఉన్న కాస్త మతిపోయింది. అట్లాగే నిలువు గుడ్లతో నిలబడ్డ నన్నుచూసి "గుర్తుపట్టలేదా బావా? నేను కామాక్షమ్మ కూతురిని. మీనాక్షిని" అంది. నా మెదడులో ఏదో మెరిసినట్లయింది. గుండె కొట్టుకోవడం,



# చికిత్స

పి. పాం. రెడ్డి



మెదడు పనిచేయడం ప్రారంభించిం౦.

"నువ్వా మరదలా! సత్యం మామను తప్ప మరెవరిని చేసుకోననే దానివి చిన్నప్పుడు. గుర్తుందా!" అన్నా నవ్వుతూ.

"పో బావా, అన్ని అబద్ధాలే" అంది ముద్దుగా.

"నిజమే మరి. మీ అక్క తొందరపడి నన్నుచేసుకోకుండా ఇందాక ఆగివుంటే నీవన్నదాన్ని నిజంచేసే వాణ్నే.' అన్నా.

సిగ్గులు బుగ్గల్లో దూరగా అరవిచ్చిన మొగ్గల్లే అక్కడనుంచి వెళ్ళిపోయింది.

భోజనాల దగ్గర, పానువుల దగ్గర, వరాచికాల దగ్గరా మీనాక్షిని అంటి పెట్టుకునే వున్నా. మధ్యాహ్న భోజనాలు అయినాయి. మంచముమీద వాలాను. మీనా కనపడక అరగంటయింది. నా మనసంతా చిరాగ్గా చిక్కు చిక్కుగా వుంది. నిద్రమత్తులో వున్నట్లుంది మా ఆవిడ ఆవులిస్తూ వచ్చింది.



వసంత హాసం ఫొటో : ఎన్. శివన్నారాయణ, మద్రాసు

# వసంత శోభ

మలయ సమీర రథ్య సుషమా పరివర్తిత పుష్పవాసనా
కలిత యశో విభూతియె, అకల్పిత జీవమ భూతలమ్ముకున్
సలలిత రాగ ధారల నొసంగి; మధూళిని హత్త-కోకిలల్
కలరుత మాధురిన్ పొదిగి గానము సేయ వసంత శోభిలెన్!

మనియెద నేను సంతస, సమావృత శోభిత చైత్రమందు; నా
తనువుకు తాకె కోరికలు తావుకొనెన్ శబలాకృతమ్ములై
మనమున భావముల్ విరిసె మారుని చారుశరమ్ము లట్టుగా
తనరుచు ధారుణీతలము తాండవమాడె వసంత శోభతో!

—సాంధ్యశ్రీ

"అరగంటనుంచి యెక్కడ కెళ్ళావ్?" అన్నా కోపంగా. మా ఆవిడ విసుగుపోతూ "అరగంట కాదండి. నాకు మీరు కనిపించక ఆరు గంటలయింది." అంది.

అప్పుడు గుర్తుకు వచ్చింది నేను మాట్లాడుతుంది మా ఆవిడతోనని. వెంటనే సర్దుకొని, "అదేనే శారూ! ఆరు గంటలయింది కదా. ఆయనేం తిన్నాడో ఎట్లా ఉన్నాడో అనేమైనాఆలోచించావా? ఎంత చెల్లెలి పెండ్లి అయితే మాత్రము మొగుణ్ని మరిచిపోతారా ఎక్కడైనా!" అన్నాను చిరుకోపంతో.

"మీకేమండి. అల్లుడి హోదాలో రాచ మర్యాద అందుకుంటూ హాయిగావున్నారు. నేను రెండుకాళ్ళు ఒక్కచోట పెటే తీరిక లేక చస్తున్నా. తిండికి కూడా నోచుకో లేదు" అంది చావ వరుచుకొని మేను వాలుస్తూ.

"వెనుకటికి సముద్ర మధ్యంలో ఒక నావికుడు "చుట్టూ నీళ్ళేకానిదప్పిక తీర్చుకోవడానికి చారెడు నీళ్ళు దొరక్క-చస్తున్నా" అన్నాడట. అట్లా వుంది నీ వ్యవహారం. ఖర్చు ఎక్కువగా అయిందని ఏమైనా దిగులుపడ్డావా?" అన్నాను.

"మొత్తానికి అట్లాంటిదే ఓ దిగులు. నాలుగు మెతుకులు నోట్లో వేసుకుందామని కూర్చున్నానా. ఇంతలో కామాక్షమ్మ పిన్ని వచ్చి కంట నీరు పెట్టుకొని కన్న కూతురి గోడు వెళ్ళబోసుకుంది. అదివినేసరికి కడుపునిండి,కంచము కడిగివచ్చేశా" నంది.

కామాక్షమ్మ అనగానే చీకటికొట్లో లైట్ వెలిగినట్లు నా మనసులో మీనాక్షి మెదిలింది.

"కామాక్షమ్మ కూతురు కేమయిందేం" అన్నాను ఆతురతగా.

"ఆ అమ్మాయి కేమయింది! ఆస్తి-అంతస్థు, అందము- చందము, చదువు సంప్రదాయము అన్నీ వున్నాయి. లేని దొక్కటే మతి" అంది.

"ఏది, అలాగా కనపడలేదే; అన్నీ తెలిసిన ఆరిందాలాగే వుందె" అన్నాను ఆలోచిస్తూ.

"అక్కడేనండి వచ్చింది చిక్కు. బాగానే వున్నట్టు వుంటుంది. ఉండివుండి రోకలి తలకు చుట్టమంటుంది. ఆ మధ్య ఒక అబ్బాయి. అబ్బాయి తండ్రి అమ్మాయిని చూడటానికి వచ్చారట. అన్నీ సరిపోయాయి. అబ్బాయి వుల్లాసంగా ఈల వేసుకుంటూ తలదువ్వకుంటూ వున్నాడట డ్రాయింగ్ రూమ్‌లో. గడప దగ్గరకు వచ్చిన పిల్ల ఊరుకోక "ఏమండి మీరేనా పెండ్లికొడుకు" అందిట. "ఆహా కాదు.

ఆ వరంశాలో వున్నా నిన" అన్నాడట వెటకారంగా తండ్రిని చూపిస్తూ.

"ఇప్పటిదాకా ఆయనే అనుకొని సంతోషపడా ఇప్పుడు తెలిసింది మీరని" అందిట దిగులుగా. ఆ అబ్బాయి నిర్ఘాంత పోయి ఉన్నపళంగా వెళ్ళిపోయాడట. పిలుస్తున్న తండ్రిని కూడా విన్పించుకోకుండా.

"ఏమే. నీ అహంభావం" అందిట పిన్నికోపంపట్టలేక. ఆ అబ్బాయి కెందుకంత అహంకారం అందిట! ఇంక యేమి చేస్తుంది పిన్ని? మొన్న వచ్చిన సంబంధం చూడండి. ఆ అబ్బాయి దూరపు బంధువు. అతడు రాగానే ఎదురుగా వెళ్ళి "కామాక్షమ్మ కూతురిని మీనాక్షిని" అని స్వయముగా పరిచయము చేసుకుందిట. పిన్ని లోపలికి పిల్చి "నిక్షేపము లాంటి సంబంధం నఓటిలో కలుపకే" అని బ్రతిమాలుకొందిట. ఆ అబ్బాయి పెరట్లోకి వెళ్ళగానే "సబ్బు ఇచ్చేదా బావా" అందిట. సబ్బు తీసుకొని తిరిగి ఇవ్వడంలో చెయి తగిలిందో లేదో తెలియదుగాని "ఏయ్. నా చేయి పటుకొంటా?! నే నెవరో తెలుసా. కామాక్షమ్మ కూతురిని. మీనాక్షిని" అంటూ కనక దుర్గమ్మలా విరుచుకపడిందట. ఇంకేముంది! ఆ పిల్లవాడు సబ్బుముఖంతోనే పరారుకాగా అడ్రసు వెతికి అతని సూటు కేసు పంపేసరికి తలప్రాణం తోకకు వచ్చిందట. నాకు నిజంగా చాలా విచారం. ఆశ్చర్యం కలిగాయండి. ఏదైనా ఆస్పత్రి కన్నా తీసుకెళ్ళమని సలహా చెప్పా"నంది అవులిస్తూ.

వింటూ ఆలోచిస్తున్న నేను హఠాతుగా తలయెత్తి ఆవిడ అమాయకత్వానికి జాలిపడ్తూ "అదేం జబ్బు కాదే. హాస్పిటల్‌కు తీసుకెళ్ళడానికి. అదిఅందం తెచ్చిన అహంభావం. మగవాళ్ళను మురిపించి మరిపించి మర్యాద తీసే మగువ తెగువతనం" అని స్త్రీ మనస్తత్వ పరిశోధనా సారాన్ని విశదీకరిస్తూ, సాభిప్రాయంగా మా ఆవిడవైపు చూసేసరికి ఆవిడ నా విశదీకరణతో నిమిత్తం లేనట్లు కునుకుతీస్తూ కనిపించింది. నాకుచాలాకోపం వచ్చింది. కాని ఏదో ఈ మధ్య నిద్రలేదు కదా పాపం అనుకున్నాను. అమ్మాయిల మనస్తత్వం ఇంత అగాథమా! అనుకుంటూ ఎప్పుడు కళ్ళు మూసుకున్నానో తెలియదు. నేను లేచేసరికి నాలుగు గంటలయింది. ముఖానికి పాలిష్ చేద్దామని ప్రాథమిక చర్యగా పెరట్లోకి వెళ్ళేసరికి మీనాక్షి నన్నని పెదాలు కొంచెం




మీరు ఎంతో అందంగా ఉన్నారు

మీ అందానికి హ్యాండ్‌లూమ్ హౌస్ మెరుగులు దిద్దుతుంది

చీరలు, శ్రేష్ఠమైనవి. అయినా ధర సమంజసం. సిల్కు, ఆర్ట్ మిక్స్చర్ కాటన్ - బనారస్. పోచంపల్లి, కంచి, ధర్మవరం, కాశ్మీరు, ఇంకా దేశంలో నలుమూలల ఖ్యాతి గాంచిన కేంద్రాల తయారి. ఫర్నిషింగ్స్, బెడ్ కవర్లు వివిధ రకాలు-నమూనాలలో మీ కుటుంబంలో వారందరికీ రెడిమేడ్ దుస్తులు.

మీ వ్యక్తిత్వం ఉట్టి పడేలా చేయడానికి ఎన్నో హంగులు,

హేండ్‌లూం హౌస్

(పూ ర్తిగా ఎయిర్‌కండిషన్ - చేనేత వస్త్రాల విధి-)

మాదాటి సోమప్పభవన్.
గాంధీభవన్ ప్రక్కన.
నాంపల్లి, హైదరాబాద్-1
ఫోన్ : 50252

ఆదివారాలు-
శెలవురోజులలోకూడా
తెరిచి వుంటుంది.



ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు
★ఫుల్‌వాయిల్, ఆఫ్‌వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, 2x2 రూబియాలాన్సు
★స్కూలు యూనిఫారంలు... వగైరాలకు

విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట ......... విజయవాడ-2.

సర్కార్సు ఇంజినీరింగు కాలేజి
మచిలీపట్నం-521001, ఆంధ్ర ప్రదేశ్

బి ఇ. డిగ్రీకి సమానంగా ప్రభుత్వంచే గుర్తింపబడిన ఏ ఎం. ఐ ఇ పరీక్షలకు సమగ్ర శిక్షణ ఇవ్వబడుతున్నది. కనీసం అర్హత పూర్తిగా కాని పాక్షికంగా కాని ఎం. పి. సి గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణత ఎల్. సి. ఇ; ఎల్. ఎం. ఇ మిత వ్యయంతో స్వల్ప వ్యవధితో మంచి అవకాశం. 1980 నవంబరు ఎ. ఎం. ఐ ఇ సెక్షన్ 'ఎ' పరీక్షకు శిక్షణ మొదలైంది పోస్టల్ ట్యూషన్ ఏర్పాటు వుంది ఉచిత ప్రాస్పెక్టసు కోసం వెంటనే వ్రాయండి.

ఎస్. టి. జ్ఞానప్రకాశం
ఎం ఇ. ఎం. ఐ ఇ
ప్రిన్సిపాల్.

"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనా సరే వానిరంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మమువలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి. **Address :**
Jeevan kalyan (B.D-8)
P.O. KATRI SARAI (GAYA)

వగలిన దాండవండులా విచ్చుకున్నాయి. నా మతి గతి తప్పింది.

"సబ్బు యిచ్చేదా బావా?" అంది ముద్దుగా.

కొరడాతో కొటినట్లు ఎగిరిపడ్డాను. మా ఆవిడ చెప్పిన విషయము గురుకువచ్చి.

"నీ వేమి ఇవ్వాల్సిన పనిలేదులే. నాకు చేతులున్నాయి నే తీసుకోగలను" అన్నాను కటువుగా నా కంఠము నాకే ఎబ్బెట్టుగా వినబడి తెల్లబోయాను ఆ అమ్మాయి నిశ్చేష్టురాలై నిలబడిపోయి కళ్ళు దించుకొని వెళ్ళిపోయింది. నా మనసు కుదటబడింది. "నా కళ్ళముందు కళ్ళు తెరిచినపిల్ల నాతోనే చెలగాటమాడాలనుకుంది. నా కేమీ తెలియదనుకొంది కాబోలు ఈవిడ వ్యవహారం" అనుకున్నా కొంచెం కసిగా. ప్రమాదం తప్పించుకున్న నా తెలివికి తృప్తిగా. అంతే ఆ అమ్మాయి ఆ తర్వాత నాకంటికి కన్పించలేదు.

మా కామాక్షమ్మత్త ఆ రోజు మా ఇంట్లో కాలు పెట్టకపోతే మీనాక్షి కథ అంతటితో అంతమై వుండేదే! ఒక పరమ సత్యం మరుగునబడి బయల్పడకపోయేదే.

స్వాగత సత్కారాలు పూర్తి అయిన తర్వాత కామాక్షమ్మత్త మంచం మీద శరీరాన్ని చేరవేసి తాపీగా మొదలుపెట్టింది. "ఒరేయి సత్యం! అమ్మాయి పెండ్లి రేపు దశమికి నిర్ణయించారురా. మీ రిద్దరు తప్పక రావాలిరా" అంది.

"అయితే అమ్మాయికి యిప్పటికి కుదిరిందన్న మాట తిక్క" అన్నాను.

"దానికేమి తిక్కరా" అంది ఆశ్చర్యంగా.

"లేకపోతే యిప్పటిదాకా సంబంధాలు యెందుకు చెడిపోయాయి" అన్నా. నా కంతా తెలుసులే అన్నట్లు వ్యంగ్యంగా నవ్వుతూ.

ఆమె ఒక్క వుదుటున లేచి కూర్చుంది. "అసలు సంబంధాలు చూడవలసిన అవసర మేముందిరా. వాళ్ళ బావ విదేశీ చదువు పూర్తిచేసుకొని ఈ మధ్యనే తిరిగి వచ్చాడు. అందుకని ఆపాము కాని సంబంధాలు చెడికాదు" అంది. అంటూ నీవు ఎవరి విషయమో వినివుంటావు" అంటూ పూర్తిచేసింది.

ఈసారి ఆశ్చర్యపోవడం నా వంతయింది.

"భోజనానికి రా పిన్నీ!" అంటూ వాకిట్లోకి వచ్చిన మా ఆవిడను సాలోచనగా చూశాను. ఆవిడ ముఖంలో ఏలాంటి భావమూ లేదు.

గతమంతా జ్ఞాపకానికొచ్చింది సత్యం తెరచాటునుంచి బయటపడింది.

శకుంతల సంగతి కూడా ఇంతే అయి వుంటుంది! "శకుంతల తలంతా నెరిసిందండి పాపం. వాళ్ళకక్క అతిజాగ్రతగా రంగు అద్ది జడవేసుంది" అందొకసారి మా ఆవిడ. అప్పటిదాక నా హృదయం ప్రచ్ఛన్నంగా ఆరాధిస్తున్న శకుంతల స్వరూపం నా ఊహాపథంలో ముగ్గుబుట్ట లాంటి తలతో కన్పించేసరికి వళ్ళు ఝల్లుమంది. ఆ తర్వాత మరెప్పుడూ శకుంతల వైపు తలెత్తి చూళ్ళేదు.

మనసులో మరో అర తెరచుకొంది విరిసిన మల్లెలా, కడిగిన ముత్యంలా వుండేది మొగుడు విడిచిన కనకం. కాదు కాదు మొగుణ్ని విడిచిన కనకం. నా చూపులు ఆమె అందాల వంపులమీద వాలేవి. ఒకనాడు మా ఆవిడ "కనకం వళ్ళంతా జిలటండి పాపం. ఇప్పుడే మందు రాసి వస్తున్నాను" అంది. చేతులు కడుక్కుంటూ. అంతే! తెగులు తగిలిన మల్లెలా, రంగు వెలసిన ముత్యంలా నా దృష్టిపథంలో కనిపించిన కనకాన్ని మరెప్పుడూ కన్నెత్తి చూడలేదు.

గతమంతా నెమరువేసుకొనేసరికి నాకు జరిగిన అన్యాయం స్పష్టంగా కన్పించి వళ్ళంతా వేడెక్కింది. "శారూ!" కంఠం చీల్చుకొని రాబోయిన కేక గడపలోకి వచ్చిన కామాక్షమ్మత్తను చూసి ఆగిపోయింది. "పోయి వస్తారా సత్యం" అన్న అత్తను అటు సాగనంపి. ఇటు ఇంటి తలుపులు మూశాను. శారద రెండు భుజాలు గట్టిగా గుచ్చి పట్టుకొని నా వైపు తిప్పుకొని "పిచ్చిదానికి పెండ్లి కుదిరిందిటగా!" అన్నాను. సాధ్యమైనంత వ్యంగ్యంగా కళ్ళలోనికి సూటిగా చూస్తూ.

ఆమె పెదవుల వొంపులపై దరహాసం మెరిసింది. "గండం గడవాలంటే వొక్కొక్కసారి గరళం పోయాల్సివస్తుంది. మీపిచ్చి దిగాలంటే దానికి పిచ్చి యెక్కించక తప్పలేదండీ. ఇందులో నాతప్పు వుంటే క్షమించండి" అంటూ తలదించుకొంది. ఆమె మోములో విరిసిన ముగ్ధత్వపు పవిత్రత నా మనసును ఆకట్టుకొంది.

ఇంత అమృత హృదయి అర్ధాంగి వుండగా పర కాంతాపేక్ష పిచ్చిగాక మరేమిటి? సున్నితమైన ఆ చికిత్సకు ప్రతిఫలంగా అర్పించాను అధరానికి. అధరం; హృదయానికి హృదయం. ★